సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9705347494
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

జీవీపీ కళాశాలను సందర్శించిన కంచి పీఠాధిపతి



గాయత్రి కళాశాలలో ఆశీర్వచనం అందిస్తున్న స్వామీజీ

మధురవాడ: నగరంలోని కొమ్మాది గాయత్రీ విద్యా పరిషత్ ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలను గురువారం కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి సందర్శించారు. ఈ సందర్భంగా పలువురుకి ఆశీర్వచనం అందజేసి, సందేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

భీమునిపట్నం: భీమిలి గ్రామ దేవత నూకాలమ్మ ఉత్సవాల కరపత్రాలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీరావు, ప్రధాన కార్యదర్శి రాంభుక్త ప్రభాకర్ నాయుడు, కోశాధికారి కాసరపు ఎల్లాజీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి నమ్మి శేషాద్రి, కోఆర్డినేటర్ ముమ్మడిశెట్టి సునీల్, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వాసుపల్లి కొండబాబు, పెద్దలు మైలిపల్లి షణ్ముఖరావు, గంటా నూకరాజు, వాసుపల్లి కొండబాబు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరించండి

మధురవాడ: జీవీఎంసీ 5, 7 వార్డుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జీవీఎంసీ మధురవాడ జోన్–2 జెడ్సీ కొట్యాడ కనక మహాలక్ష్మిని ఆయా వార్డుల కార్పొరేటర్లు మొల్లి హేమలత, పిళ్లా మంగమ్మ కోరారు. ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన మహాలక్ష్మిని గురువారం వారు కలసి ఆత్మీయ సత్కారం చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డుల్లో శానిటేషన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్వహణ పనులను మరింత బాగా చేయాలన్నారు. శ్మశాన వాటికలు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కొండవాలు ప్రాంతంలో తాగునీటి వ్యవస్థను మరింత మెరుగుపరచి, ఇంటింటికీ కుళాయిలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

గీతం సలహా సంఘం ఏర్పాటు



సంఘం ఏర్పాటుపై సమావేశమైన గీతం ప్రతినిధులు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం భవిష్యత్ లక్షణాలను చేరుకోవడానికి, పరిశోధన, విద్య తదితర అంశాల్లో మార్గదర్శకం చేయడానికి గీతం చాన్స్‌లర్ డాక్టర్ వీరేంద్ర సింగ్ చౌహాన్ అధ్యక్షతన సలహా సంఘం ఏర్పాటైంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ మాజీ డైరెక్టర్, పద్మభూషన్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ పి.బలరామ్, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ కె. శ్రీనాథరెడ్డి, ఐఐటీ ముంబై మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ అశోక్ మిశ్రాతో పాటు పలువురు గీతం సలహా సంఘం సభ్యులుగా నియమితులయ్యారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
✆ 9666125299, 9912440606

సీఎం వైఎస్ జగన్ పాలనలో స్వర్ణయుగం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



భీమిలిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

పీఎం పాలెం: రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అధికశాతం మంది లబ్ధిపొంది సంతోషంగా ఉన్నారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాగిస్తున్న పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తోందని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా శిల్పారామం (జాతర)లో జీవీఎంసీ 5,6 వార్డుల గృహ సారథులు, కన్వీనర్లు,సచివాలయాల పరిధి ఇన్‌చార్జిల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. నియోజక వర్గ ఇన్‌చార్జి ఎం.బాలరాజు మాట్లాడుతూ అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని తెలిపారు. అనంతరం కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, భీమిలి ఇన్‌చార్జి మహేష్, 5, 6 వార్డుల అధ్యక్షులు పోతిన హనుమంతరావు, బొట్ట అప్పలరాజు, అధ్యక్షురాలు కె. వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గాదె రోశిరెడ్డి ,జె.ఎస్. రెడ్డి, పిళ్లా సత్యనారాయణ, పోతిన యల్లాజీ , వాండ్రాసి రవికుమార్,ఈఎస్ఎస్ చంద్రరావు, పోతిన శివ, తదతరులు పాల్గొన్నారు.

గృహ సారథులు బాధ్యతగా పని చేయాలి

భీమునిపట్నం: గృహసారథులు బాధ్యతగా పనిచేసి తమకు అప్పగించిన పనులను విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి పరిధిలోని 1, 2, 3, 4 వార్డుల్లో కొత్తగా నియమితులైన గృహ సారథులకు గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. ఈనెల 20 నుంచి గృహసారథులు ప్రతీ ఇంటికి వెళ్లి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించాలన్నారు. ఎవరికైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారులతోపాటు తనకు తెలియజేయాలని చెప్పారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి టీడీపీ, జనసేన నాయకులు ఓర్వలేక పోతున్నారని చెప్పారు. అందువల్లే ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని తెలిపారు.ఎవరెన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు పి.బాలరాజు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సమర్థంగా బాధ్యతలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

డ్రైనేజీలపై నిర్మాణాల తొలగింపు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు గొల్లవీధిలో రహదారికి ఇరువైపులా డ్రైనేజీలపై ఆక్రమణల తొలగింపునకు గురువారం టౌన్ ప్లానింగ్ అధికారి ఝాన్సీ శ్రీకారం చుట్టారు. 'డ్రైనేజీలపై ఇష్టారాజ్యంగా నిర్మాణాలు' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు ఆమె స్పందించారు. టౌన్ ప్లానింగ్, సచివాలయ సిబ్బందితో గొల్లవీధిలో డ్రైనేజీలపై ఆక్రమణలను పరిశీలించారు. మురుగునీటి ప్రవాహానికి ఇబ్బందిగా ఉన్న ఆక్రమణలు తొలగించవలసిందేనన్నారు. ఇకపై భీమిలిలో ఎవరూ డ్రైనేజీలపై నిర్మాణాలు చేపట్టకుండా సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని తెలిపారు. శుక్రవారం ఉదయం జేసీబీతో పూర్తి స్థాయిలో తొలగింపులు చేపడతామన్నారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది లక్ష్మినారాయణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీలపై నిర్మాణాల తొలగింపును పర్యవేక్షిస్తున్న టీపీవో ఝాన్సీ

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాలి

మధురవాడ: ఫుట్‌పాత్‌లు పాదచారుల రాకపోకలకు అనువుగా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని మధురవాడ పౌర సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవడంతో సీనియర్ సిటిజన్స్, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు తెలిపారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసు ఇన్‌స్పెక్టర్ ఎస్.సాయిని వారు కలసి ఆత్మీయ సత్కారం చేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఇతర ప్రజా అవగాహన కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని వారు చెప్పారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ మధురవాడలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ అంతా సహకరించాలని కోరారు. అనంతరం ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న సంఘ సభ్యుడు ప్రసాదరావుకు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమాల్లో సంఘ అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు, కార్యదర్శి తాతపూడి ప్రదీప్ కుమార్, కార్యవర్గ సభ్యులు జగన్మోహనరావు, వరలక్ష్మి, డాక్టర్ రమేష్, బెల్లాపు పాపారావు, తోట ఆశా స్వరూప్, డి.కావ్యరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ సీఐ సాయిని సత్కరిస్తున్న పౌర సంక్షేమ సంఘం నాయకులు

కమనీయం.. దత్తాత్రేయ కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చక స్వాములు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

పద్మనాభం: మండలంలోని బుడ్డివలస–అగ్రహారం పంచాయతీ లింగన్నపేటలో గాయత్రీ ఆలయ పదో వార్షికోత్సవం సందర్భంగా గురువారం దత్తాత్రేయ స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా దత్తాత్రేయ స్వామి, అనఘాదేవి విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. అనంతరం ప్రత్యేకంగా రూపొందించి వేదికపై అర్చకస్వాములు కల్యాణం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, బుడ్డివలస–అగ్రహారం సర్పంచ్ పిన్నింటి సూర్యనారయణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు

- సుఖీభవ కాలనీలో శునకాల తిష్ట
- హడలిపోతున్న స్థానికులు



ద్విచక్రవాహనాల వెంటపడుతున్న కుక్కలు



కాలనీ కూడలిలో కుక్కల గుంపు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు చిట్టివలస–చిల్లపేట వద్ద సుఖీభవ కాలనీ వాసులను కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. ఇళ్లముందు, వీధుల్లో కుక్కలు తిష్టవేసి వచ్చేపోయే వారిపై దాడి చేస్తున్నాయి. దీంతో ఇంటిలోంచి బయటకు అడుగుపెట్టాలంటేనే కాలనీ వాసులు హడలిపోతున్నారు. ఈ కాలనీలో సుమారు 250 పైగా గృహాలు ఉన్నాయి. 40కు పైగా కుక్కలు నిత్యం రోడ్లపై సంచరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. దీంతో అత్యవసర పరిస్థితుల్లో కూడా చిన్నారులను బయటకు పంపించడం లేదు. ద్విచక్రవాహనాలపై వచ్చేవారి వెంటపడుతుండడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కుక్కల దాడిలో కాలనీకి చెందిన నిండుగర్భిణి తీవ్రంగా గాయపడింది. శివారులో ఉన్న ఈ కాలనీలో వీధికుక్కలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

జోన్‌లోనూ ఎక్కువే..

భీమిలి జోన్ పరిధిలో ప్రతీ వీధిలో కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా ప్రైవేట్ మార్కెట్‌లో చేపలు, మాంసం వ్యర్థాల కోసం వచ్చే కుక్కలు ఏమీ దొరకనప్పుడు ఇళ్ల ముందు కట్టి, మూసి ఉంచిన కోళ్లు, మేకలపై దాడి చేస్తున్నాయి. సంతపేట, బాలాజీనగర్, సంగివలస, కొండపేట, చిట్టివలస, వెలంపేట, కార్మికవాడ, చిల్లపేట, జీరుపేట, భీమిలిలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎక్కడో పట్టుకున్న కుక్కలకు శస్త్రచికిత్సలు చేసి భీమిలి జోన్‌లో వదిలేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



వీధిలో తిష్టవేసిన శునకాలు

పాఠశాలలో ఘటనకు బాధ్యులపై చర్యలు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి ఆదేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: అర్చకునిపాలెం ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశించారు. పాఠశాల శ్లాబు పెచ్చులూడి ముగ్గురు విద్యార్థులకు గాయాలైన విషయంపై గురువారం భీమునిపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, సమగ్ర అభియాన్ ఏపీసీ బి.శ్రీనివాసరావు, డీవైఈవో గౌరి శంకర్, ఎంఈవో ఎం.శివరాణి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యకు వినతి

అర్చకునిపాలెం ప్రాథమిక పాఠశాలలో ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు తహసీల్దార్ వేణుగోపాలరావుకు వినతి పత్రం ఇచ్చారు. వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ ఆర్. రవికుమార్, ఆర్.శ్రీనివాసరావు, ఉప్పాడ అప్పారావు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

అటవీ చట్టాలకు లోబడి సుందరీకరణ పనులు



బీచ్‌లో పనులను పరిశీలిస్తున్న రామ్ నరేష్

కొమ్మాది: సాగర్‌నగర్ బీచ్ సుందరీకరణ పనులను అటవీ చట్టాలకు లోబడి చేయాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.రామ్ నరేష్ తెలిపారు. ఇక్కడ మూడు రోజుల నుంచి బీచ్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గురువారం ఆయన ఆ పనులను పరిశీలించారు. అటవీశాఖ ఆధీనంలో ఉన్న ఈ స్థలంలో కాంక్రీట్ పనులను నిలిపివేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. సుందరీకరణ వరకు అనుమతి ఉంటుందని, శాశ్వత నిర్మాణ పనులను ఉన్నతాధికారుల అనుమతితో చేయాలని సూచించారు. బీచ్ రోడ్ వెంబడి రాత్రి సమయాల్లో అనేక మంది వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రూరల్ తహసీల్దారు కిరణ్ బదిలీ

ఆరిలోవ: రూరల్ తహసీల్దారు పాల్ కిరణ్ గురువారం బదిలీ అయ్యారు. ఆయనను రూరల్ మండలం నుంచి కలెక్టరేట్‌కు బదిలీ చేసినట్లు కలెక్టర్ మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో పాడేరు మండలం తహసీల్దారు రమణయ్యను ఇక్కడికి బదిలీ చేశారు. రమణయ్య గురువారం ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. కిరణ్ కూడా కలెక్టర్‌కు జాయినింగ్ రిపోర్టు అందజేశారు. పాల్ కిరణ్ రూరల్ తహసీల్దారుగా ఆరు నెలల క్రితం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి నుంచి తనను రిలీవ్ చేయాలని ఇటీవల కలెక్టర్‌కు విన్నవించుకోవడంతో బదిలీ చేసినట్టు తెలిసింది.

జగన్ పాలనలో అన్ని వర్గాలకూ మేలు

భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల ఇబ్బందులు తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి అని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. జీవీఎంసీ మధురవాడ జోన్–2 పరిధిలోని 5వ వార్డు కొమ్మాది వైఎస్సార్ కాలనీలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం ద్వారా జరిగిన మేలును వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న నాయకుడు జగన్‌మోహనరెడ్డి అని తెలిపారు. పథకాలు కొనసాగాలంటే మళ్లీ ఆయనే సీఎం కావాలని, అందుకు వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన జయ అనే దివ్యాంగ మహిళ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా రూ.1,55,062 మేర ఆర్థిక మేలు జరిగిందని చెబుతూ ఆ పత్రం అందజేశారు. ఆమెకు ట్రై సైకిల్ కూడా మంజూరు చేస్తానని చెప్పారు. డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీరు, అంగన్‌వాడీ భవనం, ఆకతాయిలు ఇబ్బందులు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, ఇన్‌చార్జ్ పోతిన సురేష్, 6వ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు బండారు శివలక్ష్మి, వంకర అప్పారావు, జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి, పీఎంపాలెం సీఐ వై. రామకృష్ణ, ఏసీపీ సీహెచ్ రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగ మహిళ జయకు సంక్షేమ పథకాల పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

సింహాచలేశుడికి ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణ మండపంపై అధిష్ఠింపజేసి, 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి జరిపారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, అప్పాజీ తదితరులు ఈ సేవ నిర్వహించారు.

- సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను వేయింపజేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కనుల పండువగా సాగింది. పూజల్లో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.



జీలకర్ర బెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ఆకతాయిలకు అడ్డాగా పార్కు

- ఆహ్లాదం కనుమరుగు
- రూ.2.25 కోట్లు సీఎస్ఆర్ నిధులు వృథా

తగరపువలస: ఆ పార్కు సందర్శకులకు ఆహ్లాదానికి బదులు ఆవేదన మిగులుస్తోంది. విరిగిన బల్లలు, పాడైన గేట్లు, చిందరవందరగా ఉన్న పరిసరాలతో దర్శనమిస్తోంది. జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయాన్ని ఆనుకుని మూడేళ్ల క్రితం దివీస్ లేబరేటరీ యాజమాన్యం రూ.2.25 కోట్లతో నిర్మించిన ఉద్యానవనం, ఎల్డర్స్ హెల్త్ ఎరీనా, వాకింగ్ ట్రాక్ పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా ఉంది. కంపెనీ సామాజిక సేవా నిధులతో నిర్మించిన ఈ ప్రాంగణం చుట్టూ ఫెన్సింగ్ వేసినా ఎక్కడికక్కడ ఆకతాయిలు దీనిని కత్తిరించి లోపలికి ప్రవేశిస్తున్నారు. ఇక్కడ చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు చాలా వరకు తుప్పు పట్టిపోగా, కొన్నింటిని ఆకతాయిలు ఎత్తుకుపోయారు. వృద్ధులు కోసం నిర్మించిన భీష్మాచార్య ప్రాంగణంలో మూడు కుటీరాలు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారికి అడ్డాగా మారాయి. ఈ పార్కు నిర్వహణ దేవదాయశాఖ, జీవీఎంసీకి భారమై కూర్చుంది. చుట్టుపక్కల గ్రామాల వృద్ధులు ఆసనాలు, వ్యాయామాలకు ఇక్కడకు వచ్చేవారు. ఇక్కడ జరుగుతున్న తతంగాలు జుగుప్సాకరంగా ఉండడంతో రావడం మానుకున్నారు. ఉదయం కళాశాలలు ప్రారంభం కాగానే చుట్టు పక్కల విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు తరగతులకు డుమ్మా కొట్టి ఇక్కడకు చేరుకుని విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. చీకటి పడితే ఆకతాయిలు ఇక్కడ తిష్టవేస్తున్నారు. ఆ ప్రాంగణమంతా మద్యం సీసాలతో నిండిపోయింది. ఇక్కడ రూ.లక్షలు ఖర్చుచేసి నిర్మించిన వశిష్ట కుటీరాన్ని ఆకతాయిలే తగులబెట్టారు. ఇటీవల వృద్ధులు పార్కును శుభ్రం చేసుకోవాలని అనుకున్నా వారి తలకు మించిన భారం కావడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. పక్కనే ట్రాక్‌పై వాకింగ్‌కు వచ్చేవారికి కూడా ఇక్కడ ఆకతాయిల వేధింపులు ఎక్కువయ్యాయి. పార్కులో ఏర్పాటుచేసిన సిమెంట్‌బెంచీలు తుప్పల మాటున కనుమరుగయ్యాయి. అమ్మవారి దేవాలయంలో కూడా సిబ్బంది కొరత కారణంగా పార్కుపై దృష్టి సారించలేకపోతున్నారు. అమ్మవారి ఆలయాన్ని ఆనుకుని ఉన్న ఈ ప్రాంతాన్ని అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నా జీవీఎంసీ, పోలీసులు, దివీస్, దేవదాయశాఖ అధికారులు పట్టించుకోకపోవడ విమర్శలకు దారి తీస్తోంది.



ఆకతాయిలు కట్ చేసిన ఫెన్సింగ్



తుప్పల్లో వ్యాయామ పరికరాలు

సీఎస్ఆర్ నిధులు వృథా

ఈ పార్కు కోసం ఖర్చు చేసిన దివీస్ లేబరేటరీ సీఎస్ఆర్ నిధులు వృథా అయ్యాయి. నిర్వహణపై దృష్టి సారించకపోవడం, బాధ్యతలు ఎవరికీ పూర్తిగా అప్పగించకపోవడంతో రూ.2.25 కోట్లు వృథా అయినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పార్కులో ప్రవేశాలను క్రమబద్ధీకరించి, ఆకతాయిలకు అడ్డుకట్ట వేయాలని, చిన్నారులు ఆడుకునేందుకు పార్కును, వృద్ధులకు అనువుగా భీష్మాచార్య ప్రాంగణాన్ని, వాకర్స్ కోసం ట్రాక్‌ను ఆధునికీకరించి అందుబాటులో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.



కాలిపోయిన వశిష్ట కుటీరం

సాక్షి
WALK IN INTERVIEW
సాక్షి దినపత్రికకు విజయనగరం టౌన్, ఎస్.కోట, రాజాం, సాలూరు, పాతపట్నం ప్రాంతాలలో ప్రకటనలు సేకరించుటకు స్టాఫ్ కావలెను
రిప్రజెంటేటివ్స్ / ఆఫీసర్స్
విద్యార్హత : డిగ్రీ, వయస్సు : 19–35 సం॥లు
అనుభవం : ప్రకటనల సేకరణలో లేదా ఏదైనా సేల్స్ మార్కెటింగ్‌లో అనుభవంగల వారికి ప్రాధాన్యత
జీతం : ఆకర్షణీయమైన జీతం + అలవెన్సులు ఇవ్వబడును
ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలు మరియు 2లేటెస్ట్ పాస్‌పోర్ట్ ఫొటోలతో సహా తేది. 10-02-2023 శుక్రవారం ఉదయం 10.00 గంటల నుండి ఇంటర్వ్యూలకు హాజరు కాగలరు.
ఇంటర్వ్యూకు హాజరు కాలేని వారు తమ బయోడేటాను sklmbm@sakshi.com కు మెయిల్ చేయగలరు.
SAKSHI MEDIA GROUP
సాక్షి తెలుగు దినపత్రిక
సర్వే నెం. 125/పి, ఎన్‌హెచ్–16 రోడ్, ఎచ్చెర్ల గ్రామం, మండలం, శ్రీకాకుళం.